



# EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
15 ఆగస్టు 2024
పేజీలు: 02









## ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి

# భారత్ ఎదగాలి

### ప్రధాని నరేంద్ర మోదీ

అవకాశాన్ని వదులుకోకూడదని.. దాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'విధానం, ఉద్దేశ్యం సరైన అయినప్పుడు, మనకు ఖచ్చితమైన ఫలితాలు వస్తాయన్నారు. నేడు దేశంలో కొత్త అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. గత దశాబ్దంలో మౌలిక సదుపాయాలలో అపూర్వమైన అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో పాఠశాలలు నిర్మించడం, రోడ్లు, ఓడరేవులు, రైల్వేలు, వైద్య కళాశాలలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, అమృత్ సరోవర్ వంటి కాలువల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు కోట్ల మంది పేదలకు శాశ్వత గృహాలను నిర్మించే ప్రయత్నం జరుగుతుందన్నారు. తూర్పు భారతదేశంలోని మన ప్రాంతం మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రసిద్ధి చెందిందని.. దాంతో అతిపెద్ద ప్రయోజనం సమాజంలోని ఆ వర్గాలకు అందిందన్నారు. పదేళ్లలో యువతలో కొత్త శక్తిని నింపామని.. నేడు దేశం పట్ల ప్రపంచ దృష్టికోణం మారిపోయిందన్నారు. లెక్కనేనన్ని కొత్త ఉపాధి అవకాశాలు పెరిగాయని.. అవకాశాలు సృష్టించబడ్డాయన్నారు. దేశ యువత ఇకపై నినాదంగా నడవాలని భావించడం లేదని.. నా దేశ యువత గంభీరమైన ఉత్సాహంలో ఉన్నారన్నారు. ఇది భారతదేశానికి స్వర్ణకాలమని తాను చెప్పాలనుకుంటున్నానన్నారు. ఈ అవకాశాన్ని వదులుకోకూడదని.. సద్వినియోగం చేసుకొని కలలతో ముందుకు సాగాలన్నారు.

**బ్యాంకింగ్ రంగం అభివృద్ధికి అనేక సంస్కరణ**

గతంలో బ్యాంకింగ్ రంగం విస్తరించలేదని.. అభివృద్ధి జరుగలేదని ప్రధాని అన్నారు. బ్యాంకింగ్ రంగం సంక్షోభంలో పడిందని.. ఆ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు. నేడు మన బ్యాంకింగ్ రంగం బలంగా ఉందని.. బ్యాంకులు పటిష్టంగా ఉంటే వ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచే అతిపెద్ద శక్తి బ్యాంకింగ్ రంగానికి ఉందన్నారు. రైతులు, యువత, పశువుల కాపరులు, వీధి వ్యాపారులు, లక్షలాది మంది బ్యాంకుల్లో చేరుతున్నారన్నారు. ఎంఎస్ఎంఈలకు, చిన్న పరిశ్రమలకు బ్యాంకులు సహాయం అందిస్తున్నాయన్నారు. దురదృష్టవశాత్తు ప్రజలు ఓ రకమైన మై బాప్ సంస్కృతితో పోరాడాల్సి వచ్చిందన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం బాగా ఆలోచించిన ప్రయత్నం జరుగుతోందన్నారు. రాజకీయ నాయకత్వానికి దృఢమైన నమ్మకం ఏర్పడి, ప్రభుత్వ యంత్రాంగం కలిసి ఆ కలను సాకారం చేసుకుంటే, అందులో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే కచ్చితమైన ఫలితం దక్కుతుందన్నారు.



## సూర్య ప్రధాన కార్యాలయంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

సూర్య దినపత్రిక ప్రధాన కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి అనంతరం అభివాదం చేస్తున్న చైర్మన్ నూకారపు సూర్య ప్రకాష్ రావు, డైరెక్టర్ రామచంద్ర రావు,సిజిఏం రాంబాబు మరియు సిబ్బంది.










## గోల్కొండ కోటపై రెప రెప లాడిన

# జాతీయ జెండా..

### జాతిని ఉద్దేశించి సీఎం ప్రసంగం..



గోల్కొండ కోటపై జాతీయ జెండా రెప రెపలాడింది. 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోటలో సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండా ఎగురవేసి తొలిసారి గోల్కొండ కోట నుంచి జాతిని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. భారతదేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. బ్రిటీషు బానిస సంకెళ్లు తెంచి... స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఈ రోజు మనందరికీ పర్వదినం. మన దేశ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని మువ్వన్నెల జెండాగా సగర్వంగా ఎగరేసిన ఈ రోజు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని తెలిపారు. ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగ ఫలం. సుదీర్ఘ పోరాట ఫలితం. అనేక ప్రాణత్యాగాలు, అనేకానేక జీవిత త్యాగాల ఫలితం ఈ స్వాతంత్ర్యం. ఎందరో మహామహుల త్యాగాల వెల కట్టలేని బహుమతి ఈ స్వాతంత్ర్యం. అటువంటి మహనీయులందరికీ శిరస్సు వంచి వినమ్రంగా నమస్కరిస్తున్నాను. వారి త్యాగాలను స్మరిస్తూ... తెలంగాణ రాష్ట్ర ప్రజల తరఫున వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పోరాటం అంటే ఘర్షణ.... యుద్ధం... హింస. కానీ, ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం మన స్వాతంత్ర్య పోరాటం. అహింసనే ఆయుధంగా మలిచి చేసిన మహా సంగ్రామం మన స్వాతంత్ర్య సంగ్రామం. అహింస అనే ఆయుధంతో ఇంత గొప్ప విజయాన్ని సాధించవచ్చు అని రుజువు చేసి... ప్రపంచానికి సరికొత్త యుద్ధ తంత్రాన్ని చూపించిన దేశం మనది. ఆ ఘనత, ఆ కీర్తి జాతిపిత మహాత్మాగాంధీకి దక్కుతుంది. ఈ సందర్భంగా ఆ మహనీయుడి దార్శనికతకు, శిరస్సువంచి నమస్కరిస్తున్నాను.ఈ దేశానికి స్వాతంత్ర్యం సాధించడంతో గమ్యం చేరినట్టు కాదు. అప్పుడప్పుడే పురుడు పోసుకున్న ప్రజాస్వామ్య దేశం. ఒక వైపు సవాలక్ష సమస్యలు. మరోవైపుదేశ విభజన గాయాలు. ఇంకోవైపు దేశ గుండెలపై సంస్థానాల కుంపట్లు. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలదొక్కుకోవడానికి బలమైన పునాదులు వేసి... ఆధునిక భారతావనిగా అవతరించడానికి అవసరమైన ప్రణాళికలు రచించి... కార్యాచరణలు ప్రకటించి సగర్వంగా, సమున్నతంగా ఈ దేశాన్ని నిలబెట్టాల్సిన బృహత్తర బాధ్యత నాటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం భుజాలపై ఉండింది. అజాగ్రత్తగా ఉన్నా, అలసత్వం వహించినా, రాజనీతి లోపించినా, దూరదృష్టి కొరవడినా నేడు మనం ఉన్న ఈ భారతదేశం ఒక కలగానే మిగిలిపోయి ఉండేది.శతాబ్దాల దోపిడి, అణచివేతల తరువాత స్వాతంత్ర్యానంతరం 1947 లో అధికారం చేపట్టే నాటికి అంతా శూన్యం. చేతులు కాళ్లు కూడదీసుకుని, ఒక్కొక్క వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, పారదర్శక, ప్రజాస్వామ్య పాలన అందించాల్సిన బాధ్యత నాటి నాయకత్వంపై పడింది. పంచవర్ష ప్రణాళికలు రచించి, ఈ దేశానికి వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి అన్నవి రెండు కళ్లు అని నమ్మి ఆ దిశగా తొలి అడుగులు వేయించిన దార్శనికుడు పండిట్ నెహ్రూ, ఆయన ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను మనం ఈ రోజు ఆధునిక దేవాలయాలుగా పిలుచుకుంటున్నాం. ఈ దేశంలో కోట్లాది ఎకరాలు పంటలతో పచ్చతోరణాన్ని కట్టుకున్నాయంటే దానికి కారణం నెహ్రూ ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులే.

## ఇందిరాగాంధీ స్టేడియంలో త్రివర్ణ పతాకాన్ని

# ఎగురవేసిన సీఎం చంద్రబాబు




స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసుల నుంచి సీఎం గౌరవ వందనం స్వీకరించారు. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడలో, మంత్రి లోకేశ్ గుంటూరులో నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొన్నారు.

గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను తిరిగి తెస్తాం: సీఎం చంద్రబాబు

గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను తిరిగి పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. "గత ఐదేళ్లుగా ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛను అందించేందుకు కట్టుబడి ఉంటాం. ప్రజలకు ఉపయోగపడే విధానాలు రూపొందిస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనకు శ్రీకారం చుట్టాం. 100 రోజుల ప్రణాళిక టార్గెట్‌గా అన్ని శాఖల్లో సమీక్షలు చేస్తున్నాం. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన శాఖల్ని పునరుద్ధరిస్తున్నాం. 1857 కంటే ముందే బ్రిటిష్ దుర్మార్గపు పాలనపై తెలుగు నేల తిరుగుబాటు చేసిందని చరిత్రకారులు చెబుతున్నారు.. ఇది చైతన్యం కలిగిన ప్రాంతం. విభజనతో ఏర్పడిన నవ్యాంధ్రకు రాజధాని కూడా లేని పరిస్థితిలో నాడు పాలన ప్రారంభించాం. అటువంటి పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని పట్టాలెక్కించాం. మాకున్న అనుభవం, ప్రజల సహకారంతో కొద్ది కాలంలోనే నిలదొక్కుకున్నాం. 120కి పైగా సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమంగా నిలిచాం. రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుని దేశం దృష్టిని ఆకర్షించాం" అని చంద్రబాబు తెలిపారు.

## వారి జోలికి ఎవరొచ్చినా ఊరుకోం



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పవన్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవవందాన్ని స్వీకరించారు డిప్యూటీ సీఎం. ఆపై ప్రజలనుద్దేశించి పవన్ ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా క్షీణించాయన్నారు. శాంతి భద్రతలు లేకపోతే రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి ఎవరూ ముందుకు రారన్నారు.అందుకే శాంతి భద్రతలను సమర్థవంతంగా నిర్వహించడాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో ఆడపిల్లలు, సగటు ప్రజల జోలికి ఎవరు వచ్చినా ఊరుకునేది లేదన్నారు. ఇదే విషయం కలెక్టర్, ఎస్పీల సదస్సులోనూ స్పష్టం చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా చిన్నా భిన్నం అయిపోయిందని విమర్శించారు. జల జీవన్ మిషన్ ప్రాజెక్టులకు పైపులు వేసి మంచి నీటి వసతి ఏర్పాటు చేయలేదన్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## సమంత పోస్టు.. చైతూ గురించేనా?




నాగచైతన్య, శోభిత ధూళిపాళ ఎంగేజ్‌మెంట్ నేపథ్యంలో చైతూ మాజీ భార్య సమంత ఇన్‌స్టా పోస్టు చర్చనీయాంశమైంది. 'ది మ్యూజియం ఆఫ్ పీస్ అండ్ క్వయిట్' అని రాసి ఉన్న టీషర్టును ధరించిన ఆమె తలకు చేయి పెట్టుకుని సెల్ఫీ తీసుకున్నారు. అయితే సామ్ పరోక్షంగా మిడిల్ ఫింగర్ చూపిస్తున్నారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. డైరెక్టర్ రాజ్‌తో ఆమె డేటింగ్‌లో ఉన్నారన్న రూమర్లకూ కౌంటర్ ఇచ్చారని మరికొందరు అంటున్నారు.




## 2013లో అతని వెయిట్ 610 కేజీలు, ఇప్పుడు 63..

చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఖలీద్ బిన్ మోసెన్. సౌదీకి చెందిన ఈయన పదేళ్ల క్రితం 610కిలోల బరువు ఉండేవారు. ప్రపంచంలోనే అత్యంత లావైన, బరువైన వ్యక్తిగా రికార్డు ఉంది. అతను ఏది చేసిన ఒకరిద్దరు సహాయం కావాల్సి వచ్చేది, మూడేండ్లు అధిక బరువుతో బెడ్ కే పరిమితం అయ్యాడు మోసెన్. మోసెన్ పరిస్థితిని చూసి సౌదీ రాజు అబ్దుల్లా చలించిపోయారు. వైద్యం కోసం రియాద్లోని మెడికల్ సిటీలో అన్ని ఏర్పాట్లు చేయించారు. మోసెన్ కోసం ప్రత్యేకంగా ఒక బెడ్ తయారు చేయించి, క్రేన్ సాయంతో అతన్ని అక్కడికి తరలించారు. అక్కడ 30 మంది వైద్యుల బృందం, మధ్యప్రాచ్యంలోని పలు దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు మోసెన్ బరువు తగ్గించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్యాస్ట్రిక్ బైపాస్, స్కిన్ సర్జరీలు చేశారు. రోజూ ఫిజియోథెరపీ చేయించేవారు. ప్రత్యేకమైన డైట్ రూపొందించి అందించే వారు. దీంతో ఎట్టకేలకు మోసెన్ 542 కిలోల బరువు తగ్గిపోయి, ఇప్పుడు 63 కిలోల బరువుతో హ్యాపీ గా ఉన్నాడు..


# మిస్టర్ బచ్చన్ రివ్యూ

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా వచ్చిన కొత్త సినిమా మిస్టర్ బచ్చన్. హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ప్రీమియర్ షోస్ నేడు పడ్డాయి. మరి ఏ మేరకు ఈ సినిమా మెప్పించిందో రివ్యూలోకి వెళ్లి తెలుసుకుందాం ! ఇన్ కమ్ ట్యాక్స్ ఆఫీసర్ మిస్టర్ బచ్చన్ (రవితేజ) నిజాయితీ పరుడు. అవినీతికి వ్యతిరేకి. ఓ అవినీతి పరుడైన పొగాకు వ్యాపారిపై రైడ్ చేయడంతో, ఆగ్రహించిన పైఅధికారులు మిస్టర్ బచ్చన్ ని డ్యూటీ నుంచి సస్పెండ్ చేస్తారు. ఆ తర్వాత మిస్టర్ బచ్చన్ తన సొంతూరు కోటిపల్లికి వస్తాడు. అక్కడ జిక్కీ (భాగ్య శ్రీ)ని చూసి ప్రేమలో పడతాడు. ఆమె ప్రేమ కోసం బచ్చన్ ఏం చేశాడు ?, బచ్చన్ తో జిక్కీ ఎలా ప్రేమలో పడింది ?, వీరి ప్రేమ విషయం ఇంట్లో ఎలా తెలిసింది ?, పెద్దలు పెళ్లికి ఎలా ఒప్పుకున్నారు ?, అంతలో బచ్చన్ కి ఉద్యోగంలో చేరమని ఫోన్ రావడం, బచ్చన్ తన తదుపరి రైడ్ ఎంపీ అయిన ముత్యం జగ్గయ్య (జగపతి బాబు) ఇంట్లో చేయాల్సి రావడంతో కథ మలుపు తిరుగుతుంది. అధికారులని సైతం భయపెట్టే ముత్యం జగ్గయ్య ఇంట్లో బచ్చన్ ఎలా రైడ్ చేశాడు ?, అక్కడ అతనికి ఎదురైన పరిస్థితులు ఏమిటి ?, చివరకు మిస్టర్ బచ్చన్ ఏం సాధించాడు ? అనేది మిగిలిన కథ. మిస్టర్ బచ్చన్ గా రవితేజ చాలా పవర్ ఫుల్ గా కనిపించాడు. తన శైలి కామెడీ టైమింగ్ తో పాటు స్టైలిష్ యాక్షన్ ఎలిమెంట్స్ తో మరియు బలమైన ఎమోషన్స్ తోనూ రవితేజ మెప్పించాడు. ముఖ్యంగా తన పాత్ర పరిస్థితులకు తగ్గట్టు వేరియేషన్స్ చూపిస్తూ.. రవితేజ నటించిన విధానం ఆకట్టుకుంది. పైగా తన బాడీ లాంగ్వేజ్ తో అలాగే, కొన్ని యాక్షన్ అండ్ ఎమోషనల్ సీక్వెన్స్ లో మరియు తన లుక్స్ తో రవితేజ చాలా బాగా ఆకట్టుకున్నాడు. హీరోయిన్ గా భాగ్యశ్రీ బోర్సే తన గ్లామర్ తో అలరించింది. ముఖ్యంగా సాంగ్స్ లో భాగ్యశ్రీ బోర్సే లుక్స్, స్టెప్స్ సినిమాకి ప్లస్ అయ్యాయి. విలన్ గా జగపతి బాబు తన పాత్రకు పూర్తి న్యాయం చేశారు. కమెడియన్ సత్య తన కామెడీతో నవ్వించాడు. ఫస్ట్ హాఫ్ లో సత్య సీన్స్ దాదాపు వర్కౌట్ అయ్యాయి. ఇతర కీలక పాత్రల్లో నటించిన సచిన్ ఖేడేకర్, తనికెళ్ల భరణి, గౌతమి, ప్రవీణ్ తమ పాత్రలో ఒదిగిపోయారు. అలాగే, మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రల పరిధి మేరకు బాగా నటించారు. ఒక ఇన్ కమ్ ట్యాక్స్ ఆఫీసర్ నిజాయితీతో పని చేస్తే.. సిస్టమ్ కి ఎంతో మేలు జరుగుతుందని చూపించిన విధానంతో పాటు హరీశ్ శంకర్ కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా బాగున్నాయి. మిస్టర్ బచ్చన్ పాత్రను, ఆ పాత్ర తాలూకు సీన్స్ ను బాగా డిజైన్ చేసుకున్న హరీశ్ శంకర్, అంతే స్థాయిలో ఈ సినిమా ట్రీట్మెంట్ ను రాసుకోలేదు. ముఖ్యంగా సెకండ్ హాఫ్ లో ఆసక్తికరమైన కథనాన్ని రాసుకోవడంలో ఆయన విఫలం అయ్యారు. కొన్ని సన్నివేశాలు స్లోగా మరియు రెగ్యులర్ గా సాగుతున్న ఫీలింగ్ కలుగుతుంది. హీరో – విలన్ మధ్య మైండ్ గేమ్ ని ఇంకా ఇంట్రెస్ట్ గా బిల్డ్ చేసి ఉంటే బాగుండేది. ఒక్క క్లైమాక్స్ లో తప్ప మిగిలిన కథనంలో ఉత్సుకత మిస్ అయ్యింది. కథనాన్ని ఇంకా ఆసక్తికరంగా మలిచే అవకాశం ఉన్నప్పటికీ, దర్శకుడు మాత్రం తన శైలిలోనే సినిమాని ముగించారు. మొత్తానికి హరీశ్ శంకర్ డైలాగ్స్, హీరో క్యారెక్టరైజేషన్, బీజీఎం బాగున్నప్పటికీ.. సినిమా మాత్రం యావరేజ్ గానే అనిపిస్తుంది. సెకండాఫ్ స్క్రీన్ ప్లేతో పాటు విలన్ పాత్రను ఇంకా బలంగా రాసుకుని ఉండి ఉంటే సినిమాకి మేలు జరిగేది. దర్శకుడు హరీశ్ శంకర్ తన టేకింగ్ తో మెప్పించినా.. తీసుకున్న స్టోరీ లైన్ కి పూర్తి స్థాయిలో ఆకట్టుకునే విధంగా ఆయన స్క్రీన్ ప్లేను రాసుకోలేకపోయారు. సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ అందించిన పాటలు పర్వాలేదు. సినిమాటోగ్రఫీ కూడా బాగుంది. సినిమాలోని చాలా సన్నివేశాలను చాలా బ్యూటిఫుల్ గా చిత్రీకరించారు. ఇక ఎడిటింగ్ విషయానికి వస్తే.. అక్కడక్కడ ఉన్న కొన్ని సాగతీత సీన్స్ ను ఎడిటర్ ఉజ్వల్ కులకర్ణి తగ్గించాల్సింది. నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, భూషణ్ కుమార్, కృష్ణ కుమార్, అభిషేక్ పాఠక్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. వారి నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. 'మిస్టర్ బచ్చన్' అంటూ స్టైలిష్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా వచ్చిన ఈ చిత్రంలో.. రవితేజ




నటనతో పాటు ఆయన క్యారెక్టరైజేషన్ మరియు యాక్షన్ సీన్స్, అలాగే మాస్ ఎలివేషన్స్ అండ్ ఎమోషన్స్ చాలా బాగున్నాయి. ఐతే, స్క్రీన్ ప్లే స్లోగా సాగడం, సినిమాలో ల్యాగ్ సీన్స్ ఎక్కువైపోవడం ముఖ్యంగా సెకండాఫ్ పూర్తిగా ఆకట్టుకోలేకపోవడం వంటి అంశాలు సినిమాకి మైనస్ అయ్యాయి. ఓవరాల్ గా కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ మాత్రమే ఈ చిత్రంలో కనెక్ట్ అవుతాయి.

# డబుల్ ఇస్మార్ట్ మూవీ రివ్యూ




పూరి జగన్నాథ్ లైగర్‌తో పాతాళంకి పడిపోయాడు. అలా పడిపోవడం.. ఆకాశమంత ఎత్తుకు ఎదగడం పూరికి కొత్త కాదు. రామ్, పూరి కలిసి చేసిన ఇస్మార్ట్ శంకర్ సినిమాకు సీక్వెల్‌గా డబుల్ ఇస్మార్ట్ అని తీశారు. ఇస్మార్ట్ శంకర్ అయితే మాస్ ఆడియెన్స్‌కు బాగానే ఎక్కేసింది. మరి ఈ డబుల్ ఇస్మార్ట్ కూడా అలానే హిట్ అవుతుందా? పూరి, రామ్‌కి మళ్లీ బ్లాక్ బస్టర్ వస్తుందా? నిర్మాతగా ఛార్మీ దశ తిరుగుతుందా? అన్నది చూద్దాం. బిగ్ బుల్ (సంజయ్ దత్) తనకు బ్రెయిన్ ట్యూమర్ ఉండటంతో, మూడు నెలల్లో చనిపోతాని తెలుసుకుంటాడు. తాను చిరకాలం బతకాలని కోరిక ఉండటం, బిగ్ గోల్‌తో బతకాలని అనుకుంటాడు. దీని కోసం తన మెమోరీ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ప్రయత్నాలు మొదలు పెడతాడు. ఇస్మార్ట్ శంకర్ (రామ్ పోతినేని)కి ఆల్రెడీ మెమోరీ ట్రాన్స్‌ఫర్మేషన్ సక్సెస్ అయిందని, అతనిలో తన మెమోరీస్ జొప్పించాలని, ఇస్మార్ట్ శంకర్ రూపంలో తాను మళ్లీ బతకాలని కోరుకుంటాడు. దీంతో ఇస్మార్ట్ శంకర్ కోసం తన గ్యాంగ్‌ను దింపుతాడు. ఇస్మార్ట్ శంకర్ సైతం బిగ్ బుల్ మనీని కొల్లగొడుతుంటాడు. ఈ క్రమంలో జన్నత్ (కావ్యా థాపర్) కూడా ఇస్మార్ట్ శంకర్‌తో చేతులు కలుపుతుంది. ఇస్మార్ట్ శంకర్ సైతం తన టార్గెట్ బిగ్ బుల్ అని చెబుతుంటాడు. ఇస్మార్ట్ శంకర్‌కు మెమోరీ ట్రాన్స్‌ఫర్మేషన్ చేసేందుకు బిగ్ బుల్ చేసిన ప్రయత్నాలు ఏంటి? ఆ ట్రాన్స్‌ఫర్మేషన్ జరిగిన తరువాత ఏర్పడిన పరిణామాలు ఏంటి? బిగ్ బుల్‌ను పట్టుకునేందుకు రా ఏం చేసింది? ఈ కథలో జన్నత్ పాత్ర ఏంటి? పోచమ్మ (ఝాన్సీ) కారెక్టర్‌కు ఉన్న ఇంపార్టెన్స్ ఏంటి? చివరకు ఏం జరుగుతుంది? అన్నది తెరపై చూడాల్సిందే. పూరి ప్రస్తుతం ఫాం కోల్పోయాడన్న సంగతి తెలిసిందే. సరైన హిట్టు కొట్టేందుకు చాలానే ప్రయత్నిస్తున్నాడు. ఇస్మార్ట్ శంకర్ మాస్ ఆడియెన్స్‌కి ఎక్కడంతో బాక్సాఫీస్ వద్ద గట్టెక్కింది. కానీ ఆ సినిమా కూడా లెక్కలేనన్ని విమర్శలను ఎదుర్కొంది. కానీ చివరకు మాస్ ఆడియెన్స్ పుణ్యమా అని హిట్టుగా నిలిచింది. ఆ తరువాత లైగర్ అంటూ పూరి చేతులు కాల్చుకున్నాడు. దీంతో మళ్లీ రామ్‌తో డబుల్ ఇస్మార్ట్ అని తీశాడు. ఇస్మార్ట్ శంకర్ లక్‌లో గట్టెక్కిందంటే.. మళ్లీ డబుల్ ఇస్మార్ట్ అని పూరి ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అయితే ఈ డబుల్ ఇస్మార్ట్ మాత్రం ఏ కోణంలోనూ పూరి మార్క్ క్రియేట్ చేయలేకపోయింది. మరీ ముఖ్యంగా అలీ చేత చేయించిన బోకా అనే కామెడీ ట్రాక్ చెత్తగా అనిపిస్తుంది. అలీని అలా ప్రేక్షకుడు చూడలేకపోతాడు. ఒకటి, రెండు సార్లు అంటే బాగుంటుందేమో కానీ పదే పదే తెరపై కనిపించడంతో విసుగు వస్తుంది. ఆ ట్రాక్ ఏ ఒక్క చోట కూడా నవ్వించదు. తన రైటింగ్ ఎంతగా పడిపోయింది.. ఎంత సిల్లీగా ఉంటుందని చెప్పడానికి ఆ ట్రాక్ ఒక్కటి చాలనిపిస్తుంది.ఈ సినిమాను మాత్రం రా ఏజెన్సీకి గానీ అందులో పని చేసిన వారికి అస్సలు చూపించకూడదు. రా చీఫ్, రా ఉద్యోగులు అంత సిల్లీగా ఉంటారా? అని అనిపించేలా పూరి సాయాజీ షిండే పాత్రను డిజైన్ చేశాడు. అసలు ఈ సినిమాకు మదర్ సెంటిమెంట్‌ను అద్దే ప్రయత్నం చేశాడు. కానీ ఏ కోశాన కూడా మదర్ సెంటిమెంట్ బేస్డ్ సినిమాగా అనిపించదు. పైగా అది సెంటిమెంట్ అని ఎక్కడా కూడా అనిపించదు. ఇవన్నీ చాలవనుకుంటూ ఉంటే.. చివరగా ప్రగతి పాత్రతో పూరి విసిగించాడు. ప్రస్తుతం ఆమెకు ఉన్న ఇమేజో ఏమో గానీ.. ప్రగతి నటనను చూసినా, ఆమెను తెరపై చూసినా జనాలు తలపట్టుకోవడం గ్యారెంటీ. ఆమె డైలాగ్స్ చెబుతుంటే.. ఎందుకు ఈ ఓవర్ యాక్షన్ అన్నట్టుగా కనిపిస్తుంది. పూరి సరైన కథను గానీ, కథనాన్ని కూడా రాసుకోలేదు. ఏదో హడావిడిగా చుట్టేసినట్టుగా కనిపిస్తుంది. ఇందులో చెప్పకోవడానికి కూడా కథ ఏమీ ఉండదనిపిస్తుంది. నార్త్ ఇండియా వర్సెస్ సౌత్ ఇండియా.. అంతర్యుద్ధం, కల్లోలాలు సృష్టించడం అనే థాట్ ఎలా వచ్చిందో పూరికే తెలియాలి. అసలు లైగర్ ఫ్లాప్ తరువాత పూరి ఎంత కసితో సినిమా తీసి ఉంటాడా? అని అనుకుని ఆశగా చూసే అభిమానులకు మళ్లీ నిరాశే కలుగుతుందేమో.పూరి టెక్నికల్‌గా బాగానే అనిపిస్తుంది. మాటలు కొన్ని చోట్ల బాగానే ఉంటాయి. చాలా చోట్ల బీప్‌లు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. తెరపై సాంగ్స్ పిక్చరైజేషన్ బాగుంది. మాస్ సెంటర్లో పాటలకు విజిల్స్ పడతాయి. కెమెరా పనితనం బాగుంటుంది. కొన్ని చోట్ల పూరికి వర్మ పూనినట్టుగా అనిపిస్తుంది. నిర్మాణ పరంగా భారీగానే ఖర్చు పెట్టినట్టుగా కనిపిస్తుంది. అయితే ఈ సినిమా పైసా వసూల్ అవుతుందా? లేదా? అన్నది ఇప్పుడే చెప్పలేం. కాలం కలిసి వస్తే.. మాస్ ఆడియెన్స్ మళ్లీ ఆదరిస్తే డబుల్ ఇస్మార్ట్ గట్టెక్కుతుందేమో.



## ప్రసంగంలో తన రికార్డును తానే బ్రేక్ చేసిన ప్రధాని

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల నిడివిలో ప్రధాని మోదీ తన రికార్డును తానే బద్దలుకొట్టారు. 2016లో 96 నిమిషాల పాటు ప్రసంగించగా నేడు 98 నిమిషాలతో దాన్ని దాటేశారు. ప్రధానిగా ఆయన స్పీచ్‌ల సగటు 82 నిమిషాలుగా ఉంది. మరే ప్రధానికి ఈ సగటు లేదు. అత్యల్పంగా 2017లో 56 నిమిషాల పాటు మాట్లాడారు. గత ఏడాది 90 మినిట్స్ ప్రసంగించారు.

## సంక్షేమ గురుకులాల్లో 6వేలకు పైగా ఉద్యోగాలు!

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సాధారణ గురుకులాల్లో 6వేలకు పైగా పోస్టులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 2023లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో 1,800కుపైగా బ్యాక్‌లాగ్ ఖాళీలు ఉన్నట్లు అంచనా. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీతోపాటు వివిధ విభాగాల్లో ఉన్న ఉద్యోగాలను 2025-26 జాబ్ క్యాలెండర్‌లో భర్తీ చేయనున్నట్లు సమాచారం. డీఎస్సీ, జేఎల్ నియామకాల తర్వాత మొత్తం ఖాళీలపై క్లారిటీ వస్తుందని అధికారులు చెబుతున్నారు.

## తాడేపల్లిలో జాతీయ జెండాను ఆవిష్కరించిన జగన్



తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ సీఎం వైఎస్ జగన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సమరయోధుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.